క్లుప్తంగా

పేరంటాలమ్మకు సారె సమర్పణ



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవార్లకు మహిళా భక్తులు సారె సమర్పించారు. ఆషాఢ మాసం కావడంతో పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండ్లు, పూలు, గాజులు, సారెతో మహిళలు గ్రామోత్సవంలా తరలివచ్చి పేరంటాలమ్మకు భక్తిశ్రద్ధలతో సారె సమర్పించారు.

500 మందికి ఉచిత వైద్య సేవలు



పెనమలూరు: పోరంకిలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కీర్తి శ్రీ క్లినిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 500 మందికి ఉచిత వైద్య సేవలు అందించి మందులు అందచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.భానుచంద్ర మాట్లాడుతూ గత 11 సంవత్సరాలుగా ప్రతి ఏడాది ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించటమే కాకుండా, ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఎముకలు, ఊపిరితిత్తులు, న్యూరో, గుండె, షుగర్, బీపీ తదితర వైద్య సేవలు అందించామన్నారు. ప్రముఖ వైద్యులు మండవ శుభాష్, వెలగపూడి సాగర్, కె.అన్వేష్, వీఎస్ఆర్.భూపాల్ సేవలు అందించారని తెలిపారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



పెనమలూరు: రౌడీషీటర్లు ప్రవర్తన మార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఎం.కిషోర్‌బాబు అన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సెలింగ్ చేశారు. అసాంఘిక కార్యక్రమాలు చేసే వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. రౌడీషీటర్ల కదలికల పై ప్రత్యేక నిఘా పెట్టామని తెలిపారు. రౌడీషీటర్ల ప్రవర్తనలో మార్పు వస్తే వారి పై షీట్లు తొలగిస్తామన్నారు. గంజాయి బ్యాచ్ పై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని, గంజాయి సేవించినా, విక్రయించినా కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. ఎస్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్వాహకుల సమస్యలు పరిష్కారానికి కృషి



లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని హోటల్ నిర్వాహకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని విజయవాడ హోటల్ ఓనర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు పీవీ రమణ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం విజయవాడ హోటల్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షులుగా ఆర్ఆర్ హోటల్స్ అధినేత పీవీ రమణ, కార్యదర్శిగా పార్క్ ఎన్ హోటల్ నిర్వాహకులు వెలగపూడి రాఘవ, కోశాధికారిగా చలువాది మల్లికార్జునరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు పీవీ రమణ మాట్లాడుతూ అపరిష్కృతంగా ఉన్న హోటల్ నిర్వాహకుల సమస్యల సాధనకు తమ కార్యవర్గం కృషి చేస్తుందన్నారు. జూలై 6న గుణదలలోని హోటల్ హయత్‌లో రాష్ట్ర హోటల్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక జరగనున్నట్లు పీవీ రమణ తెలిపారు.

నేడు తహసీల్దార్ కార్యాలయంలో స్పందన

విజయవాడరూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతుందని తహసీల్దార్ పి.జాహ్నవిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను స్పందన కార్యక్రమంలో పాల్గొనే అధికారులకు అర్జీల ద్వారా అందచేయాలన్నారు. సమస్యలను సంబంధిత అధికారులు ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తారని తహసీల్దార్ తెలిపారు.

ఐదుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

పెనమలూరు: మండల కేంద్రంలో పేకాటాడుతున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. గ్రామ శివారులో కొందరు వ్యక్తులు పేకాటాడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడులు చేశారు. ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి వద్ద రూ.4100 సొమ్ము స్వాధీనం చేసుకుని నిందితుల పై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

నిధుల రికవరీ జరిగేనా ?

- మూడు నెలలుగా 'సాగుతున్న' విచారణ
- రికవరీ కావాల్సిన సొమ్ము రూ.35 లక్షలు



పెనమలూరు గ్రామ పంచాయతీ భవనం

పెనమలూరు: గ్రామ పంచాయతీలో జరిగిన నిధులు దుర్వినియోగంలో ఇప్పటివరకు నయాపైసా రికవరీ చేయలేదు. గత మూడు నెలలుగా అవినీతి ఆరోపణలపై అధికారులు విచారణ చేస్తున్నా ఇప్పటివరకు ఫలితం లేకుండా పోయింది. నియోజకవర్గ కేంద్రం పెనమలూరు గ్రామ పంచాయతీకి వార్షిక ఆదాయం తక్కువగా ఉంటంతో ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయి. ఈ గ్రామ పంచాయతీలో 2016-2017 ఆర్థిక సంవత్సరం నుంచి 2021-2022 ఆర్థిక సంవత్సరం మధ్యలో ఇంటి పన్నుల కింద వసూళ్లు చేసిన సొమ్ము రూ.41,69,053, కుళాయి పన్నుల కింద వసూళ్లు చేసిన సొమ్ము రూ.5,34,900 కలిపి మొత్తం రూ. 47,03,953 గతంలో పని చేసిన బిల్లు కలెక్టర్ షేక్.షంషుద్దీన్ దుర్వినియోగం చేశాడని ఆరోపణలు వచ్చాయి. బిల్లు కలెక్టర్ చోడవరం గ్రామాకి బదిలీ అయ్యి రికార్డులు అప్పగించకుండా పారిపోయాడు. ఈ ఘటన పై విచారణకు డీపీవో ఆదేశించారు. బిల్లు కలెక్టర్‌ను నిధుల దుర్వినియోగం ఆరోపణల పై సస్పెన్షన్ చేశారు.

డీఎల్‌పీవో విచారణ....

కాగా ఈ ఘటన పై గుడివాడ డీఎల్‌పీవో సంపత్ కుమారి విచారణ చేశారు. ఆమె విచారణలో రూ. 47,03,953లో బిల్లు కలెక్టర్ రూ 11,19,811 నిధులు గ్రామ పంచాయతీకి జమ చేశారని ఇంకా రూ.35,82,942 సొమ్ము బిల్లు కలెక్టర్ దుర్వినియోగం చేశారని నివేదిక డీపీవోకు ఇచ్చారు. గతంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులుగా పని చేసిన ఎంపీయు.ప్రసాద్, ప్రస్తుత కార్యదర్శి కె.రాధాకృష్ణ నిర్లక్ష్య పాత్ర ఉందని నివేదికలో పేర్కొన్నారు. డీఎల్‌పీవో ఈ నివేదిక ఇచ్చి దాదాపు నెల రోజులు గడిచినా పై ఉద్యోగుల పై ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదు. కనిపించకుండా పోయిన బిల్లు కలెక్టర్ ఆచూకీ తెలుసుకోలేక పోయారు. పెనమలూరు పంచాయతీ రికార్డులు సైతం అప్పగించలేదు. దుర్వినియోగం జరిగిన నిధుల్లో నయాపైసా కూడా అధికారులు వసూళ్లు చేయటంలో పూర్తిగా విఫలమయ్యారు. అంతంత మాత్రంగానే ఆదాయ వనరులు ఉన్న పెనమలూరు గ్రామ పంచాయతీకి పరిస్థితి నేడు అగమ్యగోచరంగా మారింది. సొమ్ము రికవరీలో అధికారులు తాత్సారం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

దుర్వినియోగం జరిగిన గ్రామ పంచాయతీ సొమ్ము వెంటనే రికవరీ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని గ్రామ పంచాయతీ పాలకులు తెలిపారు.

చర్యలు తీసుకుంటా..

పెనమలూరు గ్రామ పంచాయతీలో నిధులు దుర్వినియోగం పై చర్యలు తీసుకుంటాను. బిల్లు కలెక్టర్ పై క్రిమినల్ కేసు పెట్టాలని ఈవోపీఆర్డీని ఆదేశించాను. ఇద్దరు కార్యదర్శుల పై చర్యలకు పంచాయతీరాజ్ కమిషనర్‌కు నివేదిక పంపుతాను.

– నాగేశ్వర్‌నాయక్, జిల్లా పంచాయతీ అధికారి

శిశువు ప్రాణాలు కాపాడిన వైద్యులు



గర్భంలో శిశువును కాపాడిన వైద్య బృందం

పెనమలూరు: పోరంకి కామినేని ఆస్పత్రిలో తల్లి గర్భంలో ప్రమాదస్థితిలో ఉన్న శిశువుకు జన్మనిచ్చి తల్లీ బిడ్డ ప్రాణాలు కాపాడారు. ఈ మేరకు కామినేని ఆస్పత్రి వైద్య బృందం వివరాలు వెల్లడించారు. పాలకొల్లుకు చెందిన మహిళ(32) గతంలో అనివార్య కారణాల అబార్షన్ అయింది. రెండవ సారి గర్భం దాల్చిన నేపథ్యంలో హైరిస్క్ ప్రెగ్నెన్సీ చికిత్స, నియోనేటల్ ఐసీయు ఒకే చోట ఉండటంతో దంపతులు కామినేని వైద్యులను సంప్రదించారు. తల్లి ఆరోగ్యంగా లేక పోవటంతో గర్భంలో బిడ్డ జీవించే అవకాశం తక్కువగా ఉండటంతో 31 వారాల్లోనే సిజేరియన్ (9 వారాలకు ముందుగా) ఆపరేషన్ చేసి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. అయితే పుట్టిన బిడ్డ కేవలం 1000 గ్రాములు స్వల్ప బరువు మాత్రమే ఉండటంతో 20 రోజుల పాటు తల్లి సంరక్షణలో బిడ్డకు ప్రమాదం లేకుండా వైద్యులు కాపాడారు. తల్లి, బిడ్డకు క్షేమంగా ఆదివారం డిశ్చార్జ్ చేశారు. కామినేని వైద్య బృందం డి.శాంతిప్రియ, జి.మధురిక, అఖిల్ చిట్టూరి, సౌజన్య యలవర్తి పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీతిరుపతమ్మకు సారె సమర్పణ



అమ్మవారికి పూజలు చేస్తున్న ఫణిశేఖర్ దంపతులు

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలో వేం చేసి ఉన్న శ్రీలక్ష్మీతిరుపతమ్మకు ఆదివారం భక్తులు ఆషాఢ సారెను సమర్పించారు. తొలుత పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, భక్తులు సారెతో భారీ ఊరేగింపుగా ఆలయానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా శ్రీగోపయ్య సమేత శ్రీలక్ష్మీతిరుపతమ్మకు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి సారె, పండ్లు, పూలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులు శ్రీలలిత సహస్రనామ పారాయణం జరిపారు. అనంతరం జాస్తి ఫణిశేఖర్, శ్రీవాణి దంపతుల నేతృత్వంలో శ్రీలక్ష్మీ అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్, ఉప సర్పంచ్ పాలడుగు నాని, విజయవాడ కార్పొరేటర్ దేవినేని అపర్ణ, హిందూ ధర్మిక మండలి అధ్యక్షుడు మండవ వెంకట ప్రభాకరరావు, పీఏసీఎస్ అధ్యక్షురాలు కాసరనేని పద్మప్రియ, పరిసరా గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

పోలీస్ సర్కిల్ భవన నిర్మాణ పనుల పరిశీలన



నిర్మాణంలో ఉన్న పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వంశీమోహన్

హనుమాన్‌జంక్షన్‌రూరల్: హనుమాన్‌జంక్షన్ పోలీస్ సర్కిల్ కార్యాలయం నూతన భవన నిర్మాణాన్ని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ఆదివారం పరిశీలించారు. దీర్ఘకాలంగా అద్దె భవనంలో కొనసాగుతున్న పోలీస్ సర్కిల్ కార్యాలయానికి దాతల వితరణతో సొంత భవనం నిర్మించటం హర్షణీయమని ఎమ్మెల్యే వంశీమోహన్ చెప్పారు. భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే వంశీ అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన సకల హంగులతో నూతన కార్యాలయం అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. నిర్మాణ కమిటీ సభ్యుడు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ యర్రంశెట్టి రామాంజనేయులు, సీఐ అల్లు నవీన్ నరసింహమూర్తి, ఎస్ఐ ఏడీఎల్ జనార్దన్ పాల్గొన్నారు.

ముగిసిన సంగీత సద్గురువుల ఆరాధనోత్సవాలు



వాగ్గేయకార కీర్తనలు ఆలపిస్తున్న సంగీత విద్వాంసులు కస్తూరి గోపాలరావు

విజయవాడ కల్చరల్: సంగీత సద్గురువులు సుసర్ల దక్షిణా మూర్తి 106 వ, పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 72 వ ఆరాధనా మహోత్సవాల సందర్భంగా శృంగేరీ పీఠపాలిత శివరామకృష్ణ క్షేత్రంలోని శ్రవణ సదనంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న ఆరాధనా సంగీతోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిసాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన సంగీత విద్వాంసులు, యువ కళాకారులు ఉత్సవంలో పాల్గొన్నారు. సంగీత విద్వాంసుడు కస్తూరి గోపాలరావు శ్రీగణనాథం భజరే ఈశ ముత్తుస్వామి దీక్షితార్ కీర్తన, సదామతిన్‌దలతు గదరా త్యాగరాజ స్వామి కీర్తన, ఎక్కడ చూసినా మనరాముడు మైసూర్ వాసుదాసు కీర్తన, దేవ దేవం భజే, అన్నమాచార్య కీర్తన, దేవాదిదేవ శ్రీనివాసా మైసూర్ వాసుదేవాచారి కీర్తన తదితర కీర్తనలు ఆలపించారు. రాయప్రోలు ఆలేఖ్య, పారుపల్లి ఉజ్వల కార్తికేయ, ఎం.అంజనా సుధాకర్, వయోలిన్ విద్వాంసుడు అన్నవరపు రామస్వామి సంప్రదాయ కీర్తనలు ఆలపించారు. పలువురు సంగీత విద్వాంసులు నిర్వహించిన పంచరత్న కృతుల గోష్ఠిగానం ఆకట్టుకుంది. బీవీఎస్ఎన్ కృష్ణ, పారుపల్లి ఇభానస్, నేతి శివశంకర్, మార్టూర్ హరిబాబు, డాక్టర్ కె.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టడం సామాజిక బాధ్యత



సర్టిఫికెట్ అందజేస్తున్న ఎన్డీఆర్ఎఫ్ అధికారి

గన్నవరంరూరల్: డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టడం అందరి సామాజిక బాధ్యత అని ఎన్డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ కమాండెంట్ జాహిద్‌ఖాన్ అన్నారు. విజయవాడ రైడర్స్ క్లబ్ ఆధ్వర్యంలో డ్రగ్స్ దుర్వినియోగాన్ని అరికట్టాల్సిన ఆవశ్యకతపై ఆదివారం నిర్వహించిన అవగాహన ర్యాలీ విజయవాడలో ప్రారంభమై కొండపావులూరు 10వ బెటాలియన్ ఎన్డీఆర్ఎఫ్ క్యాంపస్ వద్ద ముగిసిందన్నారు. 57 మంది బైక్ రైడర్లతో కొనసాగిన ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతూ ఆదర్శప్రాయమైన ధ్రుడత్వంతో డ్రగ్స్ దుర్వినియోగానికి వ్యతిరేకంగా ఉద్యమించిన వారందరికీ అభినందనలు తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో పాటు ఏపీలోని వివిధ నగరాలకు చెందిన 2,100 మంది పౌరులు కార్యక్రమంలో పాల్గొన్నారని చెప్పారు. పాల్గొన్న వారికి ఆయన సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అధికారులు సుఖేందు దత్తా, మహ్మద్ అస్లాం తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి సీఎం కృషి

జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ గౌస్ మొహిద్దీన్



మసీదులో కరపత్రాలను విడుదల చేస్తున్న గౌస్ మొహిద్దీన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జగనన్న ప్రభుత్వంలో మైనార్టీలకు ఎంతో మేలు జరిగిందని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ గౌస్ మొహిద్దీన్ అన్నారు. ఆదివారం విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లోని మక్కా మసీదులో హర్ దిల్‌మే వైఎస్సార్-హమ్ సబ్ జగన్ కే సాత్ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా ఎన్టీఆర్ జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దిన్ మక్కా మసీదులో నమాజ్ ఆచరించిన అనంతరం నాలుగేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి చేసిన కృషిని వివరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ముస్లిం మైనార్టీలకు రాజకీయంగా ప్రాధాన్యత కల్పించడం నుంచి షాదీ తోఫా ఆర్థిక సహాయం వరకు ప్రతి విషయంలోనూ ప్రభుత్వం అండగా ఉందన్నారు. మైనార్టీల సంక్షేమానికి వైఎస్ జగన్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందన్నారు. అనంతరం మసీదు వద్ద సమస్యలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షేక్ బడేమియా, షేక్ ఇస్మాయిల్, మసీదు ప్రెసిడెంట్ అబ్దుల్ కరీం, సెక్రెటరీ సయ్యద్ హుస్సేన్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లబ్ధిదారుల ప్రదర్శన



బాపులపాడు జగనన్న కాలనీలో ప్రదర్శన నిర్వహిస్తున్న అధికారులు, లబ్ధిదారులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: పేదోడి సొంతింటి కలను సాకారం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న తోడ్పాటు లక్షలాది మందికి భద్రతను, ఆత్మవిశ్వాసాన్ని కలిగించిందని గృహ నిర్మాణ శాఖ గన్నవరం డీఈ వెంకటేశ్వర్లు అన్నారు. ప్రధానమంత్రి అవాస్ యోజన(పీఎంఏవై) పథకం ప్రారంభించి 8 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బాపులపాడులోని జగనన్న కాలనీలో ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి అవాస్ యోజన, రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా అమలు చేస్తున్న 'పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమాల ద్వారా ఎంతో మంది లబ్ధిదారులు సొంతిల్లు నిర్మించుకుని సగర్వంగా జీవిస్తున్నారని ఆయన చెప్పారు. బాపులపాడు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా యూపీఎస్సీ శిక్షణ



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఢిల్లీలోని అతిమా ఫౌండేషన్‌తో కలిసి నగరానికి చెందిన ఆల్ మునీర్ ఫౌండేషన్ ప్రతిభ గల విద్యార్థులకు యూపీఎస్సీ ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. అందుకు సంబంధించిన అర్హత పరీక్ష ఆదివారం లబ్బీపేటలోని దర్గాహ్ ఇస్లామీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో నిర్వహించారు. ఈ పరీక్షకు 58 మంది విద్యార్థుల హాజరు కాగా, ఉత్తీర్ణులైన వారికి ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మునీర్ అహ్మద్ తెలిపారు. పేదరికం కారణంగా చదువుకోలేని చైతన్యవంతుల కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఉచిత కోచింగ్‌తో పాటు, వసతి, భోజన సదుపాయం కల్పించనున్నట్లు మునీర్ అహ్మద్ తెలిపారు. విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని అందుకు తమ ఫౌండేషన్ కృషి చేస్తున్నట్లు తెలిపారు.

సారె తెచ్చిన సంబరం



భక్తులు సమర్పించిన సారెతో అమ్మవారు



అమ్మవారి ప్రతిమలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్న భక్త బృందం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో సారె సంబరం కొనసాగుతోంది. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని పెద్ద ఎత్తున భక్తులు ఆదివారం అమ్మవారికి సారెను సమర్పించారు. దుర్గగుడి పాలక మండలి సభ్యురాలు అనుమోలు ఉదయలక్ష్మి, సత్తెనపల్లి త్రిశక్తి దుర్గా పీఠానికి చెందిన వి. హనుమత్ స్వామి వారి బృందం, కృష్ణలంకకు చెందిన గంగానమ్మ మహిళా భక్త బృందానికి చెందిన 250 మంది, విజయవాడకు చెందిన ఎస్. ప్రసాద్ బృందానికి చెందిన వంద మంది, ఎస్. వరలక్ష్మీ బృందానికి చెందిన 250 మంది, కృష్ణలంకకు చెందిన మరో 50 మంది భక్తులతో పాటు తెలంగాణాలోని పలు ప్రాంతాలకు చెందిన పలువురు భక్తులు అమ్మవారికి సారెను సమర్పించారు. సుమారు 14వందల మంది భక్తులు అమ్మవారికి సారెను సమర్పించేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేయగా, ఆలయ అధికారులు వారిని సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తి వద్ద సారెను సమర్పించారు. సారె సమర్పించిన భక్తులకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం అందజేశారు.

కానూరులో ఘనంగా 2కే రన్



కానూరులో 2కే రన్‌లో క్రీడాకారులు

పెనమలూరు: అంతర్జాతీయ ఒలంపిక్ దినోత్సవం సందర్భంగా కానూరులో ఆదివారం 2కే రన్ చేశారు. నెహ్రూ యువ కేంద్రం, అశోక్ జిమ్ ఆధ్వర్యంలో జరిగిన 2కే రన్‌ను నెహ్రూ యువ కేంద్రం ఆఫీసర్ సుంకరరాము క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. కానూరు ప్రధాన రహదారి, పంటకలువ, పోలీస్ స్టేషన్, సనత్‌నగర్ పరిసర ప్రాంతాల్లో 2కే రన్ నిర్వహించారు. కార్యక్రమంలో పటమట ఎస్ఐ సత్యనారాయణ, జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఈదా రాజేష్, కార్యదర్శి తాళ్లూరి అశోక్, వ్యాయామ క్రీడాకారులు, క్రీడాభిమానులు, ప్రలువురు ప్రముఖులు పాల్గొన్నారు. సీనియర్ వ్యాయామ క్రీడాకారులను సన్మానించారు.

నేడు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గుణదల డివిజన్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.హరిబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కేసరపల్లి, అజ్జంపూడి, బుద్దవరం, బూతిమిల్లిపాడు, జక్కుల నెక్కలం జగనన్న కాలనీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఆయా గ్రామాల గృహ, వ్యాపార, పరిశ్రమ విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు మూడు గ్రామాల్లో 'జగనన్న సురక్ష'

విజయవాడరూరల్: మండలంలో పైడూరుపాడు, ప్రసాదంపాడు, గూడవల్లి గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ బీఎల్వీ శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. మూడు గ్రామాల్లో ప్రతి రోజు జగనన్న సురక్ష కార్యక్రమంపై వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, మండల ప్రత్యేక బృందం అధికారులు, స్థానికులు కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటారన్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై జూలై 1వ తేదీన గ్రామసభ నిర్వహిస్తామని ఎంపీడీవో చెప్పారు.

నేడు ఎనికేపాడులో ఎమ్మెల్యే వంశీ పర్యటన

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులో సోమవారం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ పర్యటించి, పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారని గ్రామ సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని 24కె కల్యాణ మండపం వెనుక, హిందూ శ్మశానవాటిక సమీపంలో రెండు వాటర్ ట్యాంకుల నిర్మాణ నిమిత్తం శంకుస్థాపన చేస్తారన్నారు. జెండా చెట్టు సెంటర్‌లో మండల పరిషత్ నిధులతో అభివృద్ధి చేసిన సిమెంట్ రహదారిని, శివాలయం పల్లాల్లో సీసీ డ్రెయిన్లను ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ కన్వీనర్లు, సొసైటీ చైర్మన్లు పాల్గొనాలని ఆయన కోరారు.

ఎంఈఓ-2గా సుధారాణి బాధ్యతలు స్వీకారం

ఉయ్యూరు: ఉయ్యూరు ఎంఈఓ-2గా బి.సుధారాణి నియమితులయ్యారు. పెద ఓగిరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా బాధ్యతలు నిర్వహిస్తున్న సుధారాణి ఇటీవల జరిగిన బదిలీ ప్రక్రియలో ఉయ్యూరు ఎంఈఓ-2గా నియమితులయ్యారు. ఆదివారం ఆమె కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 28న జరిగే అమ్మ ఒడి కార్యక్రమాన్ని పాఠశాలల్లో పండుగ వాతావరణంలో నిర్వహించాలన్నారు. విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఆదేశాల మేరకు విద్యార్థులందరూ అమ్మ ఒడి పథకం ప్రారంభం రోజున జగనన్న విద్యాకానుక కిట్లతో పాఠశాలకు హాజరుకావాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను యూనిఫామ్స్‌లో పాఠశాలకు తీసుకురావాలని సూచించారు.

అత్తింటి వారిపై వరకట్నం వేధింపుల కేసు నమోదు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారి పై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తాడిగడపకు చెందిన చిలుకూరి లక్ష్మీ భార్గవి గత ఏడాది పటమట లంకకు చెందిన పి.చాణిక్యను పెద్దల సమక్షంలో కట్నకానుకలు ఇచ్చి వివాహం చేసుకుంది. అయితే అదనపు కట్నం కావాలని భర్తతో పాటు అత్త మాధవి, మామ వాసుబాబు, మరిది సాయిగౌతం, ఆడపడుచు కల్యాణి వేధించసాగారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఈ ఘటన పై పోలీసులు అత్తింటివారి పై కేసు నమోదు చేశారు.

యోగాతో మానసిక ప్రశాంతత

కంకిపాడు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత చేకూరుతాయని అనాధ రక్షయోగి ఈశ్వర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని కన్యకా పరమేశ్వరీ ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలో శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం గోసాల శాఖ ఆధ్వర్యంలో యోగ శిక్షణ కార్యక్రమం ఆదివారం ప్రారంభించారు. యోగ శిక్షణను ఈశ్వర్‌రెడ్డి పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. యోగా ప్రయోజనాల గురించి ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ వ్యాధులు దరిచేరకుండా యోగా దోహదపడుతుందన్నారు. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. మానసిక ప్రశాంతత ద్వారా నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధిస్తారన్నారు. కార్యక్రమాన్ని యోగా గురూజీ నేరెళ్ల తులసీ కృష్ణ, ఉప బోధకాచార్య కొక్కిలిగడ్డ వెంకటకృష్ణ పర్యవేక్షించారు.